సాక్షి
నిజామాబాద్
మంగళవారం ◆ 28 ◆ మార్చి ◆ 2023




ఫిర్యాదులు పరిష్కరించాలి
ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.
- 8లో ▸



అన్ని మతాలకు ప్రాధాన్యం
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇస్తోందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.5 /23.8
ఉదయం చలిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

విద్యార్థి ఉన్నత ఆశయాలను సాధించాలి



నిజామాబాద్ సిటీ: విద్యార్థులు చిన్నా నాటి నుంచి ఉన్నతమైన ఆశయాన్ని సాధించాలన్న లక్ష్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ నిర్వహిస్తున్న రోటరీ రైలా కార్యక్రమం అద్భుతమని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. సోమవారం నగర శివారు లోని దాస్‌నగర్ నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థుల కోసం రైలా – 2023 (రోటరీ యూత్ లీడర్ షిప్ అవార్డ్స్ ప్రోగ్రాం) కార్యక్రమంలో జడ్జి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి జీవితంపై ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని ముందుకు ప్రయాణించడం ఒక ఉన్నతమైన ఆలోచన అన్నారు. కార్యక్రమంలో నవ్యభారతి, హోవార్డ్, బ్లూమింగ్ బర్డ్స్, మాణిక్‌భవన్, అక్షరధామ్, నిర్మలా హృదయ కాన్వెంట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకియాట్రిస్ట్, సినీ కళాకారుడు డాక్టర్ శ్రీధర్, రోటరీ జిల్లా 3150 గవర్నర్ శరత్ చౌదరి, కార్యక్రమ చైర్మన్ జగదీశ్వర్ రావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సతీష్ షాహ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్, రీజినల్ రైలా చైర్మన్ సంతోష్ కుమార్, వైస్ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏప్రిల్ 19న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నిజామాబాద్‌నాగారం: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 19న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు సమావేశం ఉంటుందన్నారు.

31 నుంచి బోదకాలు వ్యాధిపై పరీక్షలు

నిజామాబాద్ సిటీ: జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బోదకాలు వ్యాధి నిర్మూలనకు ఈ నెల మార్చి 31 నుంచి ఏప్రిల్ 6 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు మలేరియా అధికారి తుకారం తెలిపారు. సోమవారం నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో నేషనల్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్త బోదకాలు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఎంపికయ్యాయని.. ఒకటి, రెండో తరగతుల పిల్లలకు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 6 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఎంపికైన ప్రతి పాఠశాలకు డాక్టర్, ల్యాబ్ టెక్నీషియన్లు వెళ్లి పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈ సలీం, వెంకట్ రవి, వైద్యులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



సిరికొండ: వడగండ్ల వానకు వడ్లు రాలిపోయి దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 35 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ భూపతిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాటిపల్లిలో వడ్లు రాలిపోయి దెబ్బతిన్న వరి పొలాలను మాజీ ఎమ్మెల్సీ సోమవారం పరిశీలించారు. నష్టపోయిన రైతులతో ఆయన మాట్లాడారు. 70శాతం కంటే ఎక్కువగా వడ్లు రాలిపోయిన పొలాలకే నష్ట పరిహారం వస్తుందని, నష్టం వాటిల్లిన మా పొలాల వివరాలు ఏవో నమోదు చేసుకోవడం లేదని రైతులు మాజీ ఎమ్మెల్సీతో మొరపెట్టుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 10వేలు ఎటూ సరిపోదన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, నాయకులు ఎర్రన్న, బాల్‌రాజ్‌నాయక్, భూషణ్‌రెడ్డి, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

టేకు దొంగలు..!



సిరికొండ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో టేకు చెట్ల నరికివేత జరుగుతోందని ఫారెస్టు అధికారులకు సమాచారం అందింది. ఈ నెల 11న మూడు రేంజ్‌ల అధికారులు కలిసి తూంపల్లి, పందిమడుగు, సిరికొండ, ఇతర అటవీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. దాదాపు 25కు పైగా టేకు చెట్లు నరికివేతకు గురైనట్లు గుర్తించారు. చెట్ల కొలతలు తీసుకుని డీఎఫ్‌వోకు నివేదిక అందజేశారు. కానీ, చెట్లు నరికిన వ్యక్తులు మాత్రం పట్టుబడలేదు. అయితే, నిఘా వైఫల్యానికి ముగ్గురు బీట్ ఆఫీసర్లపై క్రమ శిక్షణ చర్యలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. వారి వేతనాల్లోంచి కోత విధించనున్నట్లు సమాచారం.

నందిపేట్ మండలం ఐలాపూర్ శివారులో టేకు దుంగలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను గమనించిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. రోడ్డుపై నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రాలీని పట్టుకున్న అధికారులు టేకు దుంగలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చెట్లను ఎక్కడి నుంచి నరికి తెచ్చారని విచారించగా, నవీపేట్ ప్రాంతంలో ఓ రైతుకు సంబంధించిన వ్యవసాయ భూమిలో పెంచినట్లు తేలింది. అయితే, అటవీ చట్టం ప్రకారం పెంచుకున్న టేకు చెట్లను కోయాలంటే ఫారెస్టు అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ప్రభుత్వానికి కొంత మొత్తం డీడీ రూపంలో కట్టాలి. నిబంధనలు పాటించకుండా టేకు చెట్లను నరికినందుకు గాను రూ. 30వేలు జరిమానా వేశారు.



- జిల్లాలో గుట్టుగా అడవుల నరికివేత
- కొరవడిన ఫారెస్టు అధికారుల నిఘా
- పట్టుబడినప్పుడే మేల్కొంటున్న వైనం
- ఇతర ప్రాంతాలకు తరలుతున్న టేకు దుంగలు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : జిల్లాలో అడవులకు రక్షణ కరువైంది. ప్రతి వేసవి సీజన్‌లో టేకు చెట్లు అక్రమంగా నరికివేతకు గురవుతున్నాయి. దుంగల అక్రమ రవాణా ఇతర ప్రాంతాలకు గుట్టుగా జరుగుతున్నా, ఫారెస్టు అధికారులు నిఘా పెట్టడం లేదు. ఇతరులు ఫిర్యాదులు చేస్తే తప్ప అడవుల్లో ఏం జరుగుతుందో తెలియడం లేదు. ఇదే నెలలో వెలుగు చూసిన సిరికొండ, నందిపేట సంఘటనలే ఇందుకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. జిల్లాలో అటవీ శాఖ పరిధిలో నిజామాబాద్ నార్త్, నిజామాబాద్ సౌత్, వర్ని, కమ్మర్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ, ఆర్మూర్ కలిపి మొత్తం ఏడు రేంజ్‌లున్నాయి. జిల్లా అటవీ విస్తీర్ణం 2.14లక్షల ఎకరాలు ఉంది. అడవులను సంరక్షించడానికి 80మందికి పైగా బీట్ ఆఫీసర్లు, 30 మందికి పైగా సెక్షన్ ఆఫీసర్లు పని చేస్తున్నారు. అయితే, సిరికొండ, ఇందల్వాయి, కమ్మర్‌పల్లి రేంజ్‌ల పరిధిలో ఎక్కువగా అటవీ విస్తీర్ణం ఉంది. ఈ ప్రాంతాల్లోనే ఎక్కువగా టేకు, ఇతర చెట్ల నరికివేత గుట్టుగా జరుగుతోంది. క్షేత్రస్థాయిలో పనిచేసే అటవీ సిబ్బంది అడవులపై సరైన నిఘా పెట్టకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారు. విలువైన టేకు చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. దొంగ బిల్లులు సృష్టించి సామిల్లుల వ్యాపారులు టేకును కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. టింబర్ డిపోల్లో కూడా ఇదే రీతిలో వ్యాపారం జరుగుతుంది. కొందరు అటవీ సిబ్బంది వీరికి సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

బీట్ ఆఫీసర్లే బాధ్యులు

రేంజ్‌ల పరిధిలో పని చేస్తున్న బీట్ ఆఫీసర్లు వారి పరిధిలోని అడవుల్లో చెట్ల నరికివేత జరిగితే వేతనాల్లోంచి కోత విధించి చర్యలు చేపడుతున్నారు. సిరికొండ, ఆర్మూర్, ఇందల్వాయి రేంజ్‌లలో జరిగిన టేకు చెట్ల నరికివేత విషయంలో కూడా ముగ్గురు బీట్ ఆఫీసర్లపై చర్యలు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కానీ, అధికారులపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. చెట్లు నరికిన వ్యక్తులెవరో తేల్చడానికి ఫారెస్టు ఉన్నతాధికారులు విచారణ చేపడుతున్నారు. ఫారెస్టు చుట్టు పక్కల ప్రాంతాల్లోని గ్రామాలు, తండాలపై నిఘా పెట్టారు. ఇటు వ్యవసాయ క్షేత్రాల్లో పెంచిన టేకు చెట్లను కోసే సమయంలో రైతులు ఫారెస్టు అధికారుల అనుమతి తీసుకోవడం లేదు. టేకు చెట్లు ఎవరెవరు పెంచుతున్నారు? ఎప్పుడు కోస్తున్నారో కూడా అటవీ అధికారులను సమాచారం ఉండడం లేదు.

“ చర్యలు తీసుకుంటాం

జిల్లాలో అడవుల నరికివేత విషయంలో ఫారెస్టు శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. సిరికొండ ఫారెస్టులో జరిగిన టేకు చెట్ల నరివేత విషయంలో మరింత లోతైన విచారణ చేపడుతున్నాం. బాధ్యులపై తప్పక చర్యలు తీసుకుంటాం. నందిపేట్ మండలంలో పట్టుబడిన టేకు దుంగలు వ్యవసాయ భూమికి చెందినవని తేలింది. అనుమతి లేకుండా చెట్లు కోయడం నేరం. – వికాస్ మీనా, డీఎఫ్‌వో, నిజామాబాద్

కాంగ్రెస్‌లో కలకలం!

- సొంతగూటికి డీఎస్ రీఎంట్రీ తర్వాత కొద్ది గంటల్లోనే రాజీనామా లేఖ
- అది బీజేపీ పనేనంటూ మాజీ మేయర్ సంజయ్ వ్యాఖ్యలు
- అనారోగ్య సమస్యల్తో తన తండ్రి కాంగ్రెస్‌లో ఎలా చేరతారంటూ ఎంపీ అర్వింద్ విస్మయం
- వేర్వేరుగా అన్నదమ్ముల సందేశాలు విడుదల
- జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉమ్మడి రాష్ట్రంలో రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించి పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించిన ధర్మపురి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి రీఎంట్రీ ఇచ్చిన నేపథ్యంలో, కొన్ని గంటల తేడాతోనే చోటుచేసుకున్న వ్యవహారాలు జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ నెల 26న డీఎస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. డీఎస్‌తో పాటు ఆయన పెద్ద కుమారుడు, నిజామాబాద్ మాజీ మేయర్ సంజయ్ సైతం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇదిలా ఉండగా డీఎస్ కాంగ్రెస్ పార్టీలో చేరిన కొన్ని గంటల తేడాతోనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు లేఖ విడుదలైంది. లేఖలో సాక్షిగా డీఎస్ సతీమణి విజయలక్ష్మి పేరు ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో డీఎస్ పెద్ద కుమారుడు ధర్మపురి సంజయ్ నగరంలో ప్రెస్‌మీట్ పెట్టారు. మరోవైపు చిన్న కుమారుడు, బీజేపీ ఎంపీ అర్వింద్ ఢిల్లీ నుంచి వీడియో విడుదల చేశారు. సంజయ్ మాట్లాడుతూ డీఎస్ రాజీనామా చేయలేదన్నారు. బీజేపీ వాళ్లు విడుదల చేసిన ఈ లేఖను కాంగ్రెస్ నాయకత్వం పరిగణనలోకి తీసుకోవద్దని నిర్ణయించిందన్నారు. తుది శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీలో ఉండాలని డీఎస్ కోరుకుంటున్నారన్నారు. డీఎస్ అంటే కాంగ్రెస్‌కు సెంటిమెంట్ అన్నారు. ఇది లా ఉండగా మరోవైపు నిజామాబాద్ బీజేపీ ఎంపీ, డీఎస్ చిన్న కుమారుడు ధర్మపురి అర్వింద్ ఢిల్లీ నుంచి వీడియో విడుదల చేశారు. తాను కట్టర్ బీజేపీ వాదినని అన్నారు. డీఎస్ కట్టర్ కాంగ్రెస్‌వాది అన్నారు. అయితే డీఎస్‌కు తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా డీఎస్ కాంగ్రెస్‌లో చేరడమేమిటన్నారు. 2018 నుంచి డీఎస్ కాంగ్రెస్‌లో చేరేందుకు అడుగుతుంటే ఈ పరిస్థితుల్లో చేర్చుకోవడమేమిటన్నారు. తాను బీజేపీలో చేరినప్పుడు డీఎస్ బీఆర్ఎస్‌లో ఉన్నారన్నారు. తన రాజకీయాలకు, తన తండ్రి డీఎస్ రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డీఎస్ కాంగ్రెస్‌లోకి రీఎంట్రీ ఇవ్వడం, కొన్ని గంటల్లోనే రాజీనామా చేస్తున్నట్లు లేఖ విడుదల కావడం, కాంగ్రెస్ పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆయన పెద్ద కుమారుడు సంజయ్ ప్రకటించడం, మరోవైపు చిన్న కుమారుడు, ఎంపీ అర్వింద్ వీడియో విడుదల చేయడం చకచకా జరిగిపోయాయి. ఈ విషయమై జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

తుదిశ్వాస వరకు..

- కాంగ్రెస్‌లో ఉండాలని డీఎస్ కోరిక
- మాజీ మేయర్ సంజయ్



డీఎస్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న సంజయ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కాంగ్రెస్‌కు రాజీనామా చేసినట్లు ధర్మపురి శ్రీనివాస్ పేరిట విడుదలైన లేఖను పరిగణనలోకి తీసుకునేది లేదని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు ధర్మపురి సంజయ్ తెలిపారు. ఈ మేరకు సంజయ్ సోమవారం నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీఎస్ జీవితాంతం కాంగ్రెస్ వాదిగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. తుది శ్వాస వరకు కాంగ్రెస్‌లో ఉండాలనేది ఆయన కోరికన్నారు. ఈ నెల 26న కాంగ్రెస్‌లో తిరిగి చేరిన తరువాత 24 గంటలు కూడా గడవకముందే, ఆయన రాజీనామా చేసినట్లు విడుదలైన లేఖను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇది బీజేపీ వాళ్లు కావాలని చేస్తున్న వ్యవహారమన్నారు. డీఎస్‌తో పాటు తాను కూడా పార్టీ కండువా కప్పుకున్నానన్నారు. కాగా కాంగ్రెస్‌కు డీఎస్ అంటే సెంటిమెంట్ అన్నారు. డీఎస్ చేరికతో రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పలువురు సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. దీన్నిబట్టి కాంగ్రెస్‌లో డీఎస్ సెంటిమెంట్ ఏమిటో అర్థం చేసుకోవచ్చన్నారు. ఏమీ ఆశించకుండానే కాంగ్రెస్‌లో చేరానన్నారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించి, అందుకు సంబంధించి హామీ తీసుకుని చేరినట్లు వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. టిక్కెట్టు విషయమై తనకు పార్టీ ఏమీ హామీ ఇవ్వలేదన్నారు. తాను టిక్కెట్టు కావాలని అడగలేదన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, మిగిలిన నాయకులతో కలిసి తనవంతుగా పాటుపడతానన్నారు. ఇదిలా ఉండగా తమ కుటుంబం నుంచి మరొకరు బీజేపీలో క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయన్నారు. ఈ క్రమంలో తండ్రి డీఎస్‌తో సంజయ్ ఫోన్ చేసి మాట్లాడారు. కాంగ్రెస్‌లో చేరిక విషయమై స్పందన ఎలా ఉందని డీఎస్ అడిగారు. స్పందన బాగుందని సంజయ్ డీఎస్‌కు తెలిపారు. వందల సంఖ్యలో ఫోన్లు వస్తున్నాయని తెలిపారు.

ప్రపంచస్థాయి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కృషి

- తెయూ వీసీ రవీందర్ గుప్తా



సావనీర్ విడుదల చేస్తున్న వీసీ రవీందర్, రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ప్రముఖులు

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ యూనివర్సిటీలో ప్రపంచస్థాయి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని వీసీ రవీందర్ గుప్తా అన్నారు. సోమవారం సారంగపూర్ బీఈడీ కళాశాలలో ఎన్ఈపీసీవో–2023 జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, పరిశోధన విద్యా కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. డిచ్‌పల్లి క్యాంపస్‌తో పాటు భిక్కనూరు, సారంగపూర్ క్యాంపస్‌లో కూడా ప్రపంచ స్థాయిలో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసి అకడమిక్ లెవల్లో గుర్తింపు పొందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం జాతీయ విద్య సంస్కర్త గంటా రమేశ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం పాలసీ అమలు జరిగిందా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేడు పాఠశాలలో పూర్తి స్థాయిలో నాణ్యమైన విద్య అందడంలేదన్నారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శంకర్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం పాలసీలో భాగంగా విద్యార్థులకు విద్యను ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా విద్యను బోధించాలన్నారు. విద్యను నేర్చుకునేలా కృషిచేయాలని విద్యార్థులు కేవలం ఒక విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేయాలన్నారు. దానిలో భాగంగానే జాతీయ విద్యా విధానం తీసుకొచ్చారన్నారు. ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ విశ్వ విద్యాలయానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా విద్యార్థులకు, చదువుకునే వారందరికీ ప్రస్తుతం ఉన్న మూల్యాంకనానికి గతంలో ఉన్న మూల్యాంకనానికి చాలా మార్పులు వచ్చాయన్నారు. మూల్యాంకనం ద్వారా విద్యార్థుల శక్తి సామర్థ్యాలను గమనించి మళ్లీ విద్యార్థులకు పునః బోధన చేయాలన్నారు. అనవతరం సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ఐక్యూఏసీ డైరెక్టర్ మామిడాల ప్రవీణ్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రావులకృష్ణ, తెయూ ప్రిన్సిపాల్ మహేందర్, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారుల నిర్బంధం



కెనరా బ్యాంకుకు తాళం వేసి ఆందోళన నిర్వహిస్తున్న బాధితులు

వర్ని: వర్ని కెనరా బ్యాంక్‌లో పీడీ అకౌంట్ ఖాతాదారుల డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఖాతాదారులు బ్యాంక్ అధికారులను నిర్బంధించి బ్యాంకుకు తాళం వేసి ధర్నా నిర్వహించారు. సుమారు 45 మంది పీడీ ఖాతాదారుల డబ్బులను బ్యాంకు మేనేజర్ సునీల్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సుమా ప్రసన్న, పీడీ ఏజెంటు శ్రీనివాసులు కలిసి కాజేశారని ఆరోపించారు.

బ్యాంక్ అధికారులు కాజేసిన సుమారు రూ. 40 లక్షలను వెంటనే ఖాతాదారులకు చెల్లించాలని ధర్నా నిర్వహించారు. బ్యాంక్ అధికారులు విచారణ పేరిట రెండు నెలలుగా కాలయాపన చేస్తూ బాధితులకు డబ్బులు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డబ్బులు చెల్లించాలని.. లేదంటే ప్రతిరోజూ బ్యాంకు కార్యకలాపాలను అడ్డుకుంటామని బాధితులు రామకృష్ణ, రఘు, బాబు మియ్యలు హెచ్చరించారు. కెనరా బ్యాంకు ఏజీఎంతో పాటు ఇతర జిల్లాస్థాయి అధికారులను బ్యాంకుకు పిలిపించి మంగళవారం బాధితులకు డబ్బులు ఇచ్చేలా స్పష్టమైన హామీ ఇప్పిస్తామని పోలీసులు, బ్యాంక్ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పోలీసులు బెదిరిస్తున్నారు

బ్యాంకులో పొదుపు చేసిన డబ్బులను ఇప్పించాలని ఆందోళన చేస్తున్న తమను పోలీసులు బెదిరిస్తున్నారని ఆందోళనకారులు వెల్లడించారు. బ్యాంకు వద్ద ఆందోళన చేస్తే తమపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నట్లు బాధితులు వాపోయారు. పోలీసులు అక్రమార్కులకు అండగా నిలుస్తూ.. బాధితులను వేధించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, మన ఊరు – మన బడి, నర్సరీలు, హరితహారం, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించేందుకు మండల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో విరివిగా పర్యటించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. ఎక్కడైనా లోటుపాట్లు, సమస్యలుంటే వాటిని తమ దృష్టికి తేవాలన్నారు. కలెక్టరేట్‌లో ప్రజావాణి అనంతరం కలెక్టర్ వివిధ అంశాలపై సోమవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారానికి కనీసం ఒక గ్రామాన్ని తప్పనిసరిగా సందర్శించాలన్నారు. వేసవిలో ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా నర్సరీలు, ప్రకృతి వనాలు, ఇతర ప్రదేశాల్లో మొక్కలు ఎండిపోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవి తీవ్రతతో ఉపాధిహామీ కూలీలు పనిచేసే ప్రదేశాల్లో, జన సమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సరిపడా నీడ, తాగునీటి వసతి అందుబాటులో ఉండేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కాగా ఏప్రిల్ 11న దిశా సమావేశం జరగనున్నందున కేంద్ర నిధులతో చేపడుతున్న కార్యక్రమాలు, అమలవుతున్న పథకాల పూర్తి వివరాలతో సంబంధిత శాఖల అధికారులు ఈ నెలాఖరులోపు డీఆర్‌డీవోకు నివేదికలు అందించాలని కలెక్టర్ సూచించారు. పదోతరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, లైన్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలు ఇంకా అద్దె భవనాల్లో కొనసాగుతున్నట్లయితే సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోకి మారాలన్నారు.

డీఎంహెచ్‌వోకు అభినందనలు

క్షయ వ్యాధి నిర్మూలన చర్యలను సమర్థవంతంగా చేపడుతుండడంతో జాతీయ స్థాయిలో అవార్డు వచ్చిన సందర్భంగా డీఎంహెచ్‌వో సుదర్శనంను కలెక్టర్ అభినందించారు. అధికారులు, సిబ్బంది అందరి సమష్టి కృషితో జిల్లాకు జాతీయస్థాయి అవార్డు దక్కిందని కలెక్టర్ స్పష్టం చేశారు.

రాహుల్‌గాంధీపై కుట్రపూరితంగా అనర్హత వేటు

- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్



సత్యాగ్రహ దీక్ష చేస్తున్న నాయకులు

ఖలీల్‌వాడి: రాహుల్ గాంధీపై నరేంద్ర మోదీ సర్కారు కుట్రపూరితంగా అనర్హత వేటు వేసినట్లు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ భవన్ వద్ద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశ వేణు ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజల సంపద అదానీకి చేతికి వెళ్లడంలో నరేంద్ర మోదీ ముఖ్యపాత్ర పోషించారని ఆరోపించారు. అదానీపై రాహుల్ గాంధీ మోదీని ప్రశ్నించడంతో ప్రజల ముందు దోషిగా నిలబడతామని భయంతో కుట్రపూరితంగా అనర్హత వేటు వేశారని ఆరోపించారు. పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేసినా రాహుల్ గాంధీ భయపడరని, బీజేపీ అవినీతిని ప్రజల ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్ రెడ్డి, నాయకులు ముప్పగంగారెడ్డి, శేఖర్ గౌడ్, సయ్యద్ కైసర్, అంబర్ సింగ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా పీజీ సెమిస్టర్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి):తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్‌ ఎం అరుణ తెలిపారు. సోమవారం ఉదయం జరిగిన పీజీ 3వ, 9వ సెమిస్టర్‌ పరీక్షల్లో 1585 మంది విద్యార్థులకు 1473 మంది హాజరు కాగా 112 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పీజీ 1వ, 5వ, 7వ సెమిస్టర్‌ పరీక్షలలో 1768 మందికి 1622 మంది పరీక్ష రాశారు. ఎల్‌ఎల్‌బీ మొదటి సెమిస్టర్‌ పరీక్షల్లో 30 మందికి గానూ 26 మంది, ఎల్‌ఎల్‌ఎం మొదటి సెమిస్టర్‌ పరీక్షల్లో 10 మంది విద్యార్థులకు 9 మంది హాజరైనట్లు ఆమె వివరించారు.

నేటి నుంచి తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్‌ సమావేశాలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలోని లా కాలేజీలో మంగళ, బుధవారం (ఈ నెల 28, 29న) తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్‌ 65వ సమావేశాలు నిర్వహించనున్నట్లు వీసీ రవీందర్‌ తెలిపారు. సమావేశాలకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం తన ఛాంబర్‌లో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ విద్యావర్ధినితో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశాలకు తెలంగాణతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చరిత్ర ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరవుతారని హిస్టరీ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి ఎం వీరేందర్‌ తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్‌ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్‌ పరీక్షల్లో సోమవారం జిల్లావ్యాప్తంగా 670 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో రఘురాజ్‌ తెలిపారు. ఇంటర్‌ సెకండియర్‌ విద్యార్థులకు భౌతిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16,543 మంది విద్యార్థులకు 15,873 మంది పరీక్ష రాశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నవీపేట : పీఎఫ్‌ ఖాతాదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నెలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఎఫ్‌ నిజామాబాద్‌ ప్రాంతీయ కార్యాలయ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి శ్రావన్‌కుమార్‌ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని లిటిల్‌ ఫ్లవర్‌ పాఠశాలలో 'నిధి ఆప్‌కె నిఖత్‌ 2.0' పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతినెలా 27న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి



నిజామాబాద్‌ కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 110 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌, డీఆర్డీఓ చందర్‌, జెడ్పీ సీఈఓ గోవింద్‌ ప్రజలను ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీలు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ ఆదేశించారు. అదేవిధంగా ప్రజావాణి కార్యక్రమానికి విధిగా జిల్లా అధికారులే హాజరుకావాలని, క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాల్సిన సందర్భంలో శాఖాపరమైన అంశాలపై పూర్తి అవగాహన కలిగిన తన కిందిస్థాయి అధికారిని ప్రజావాణికి హాజరయ్యేలా చూడాలన్నారు.

కామారెడ్డి ప్రజావాణికి 56 ఫిర్యాదులు



కామారెడ్డిలో కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ ..

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కలెక్టర్‌, అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌ తెలిపారు. మొత్తం 56 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌, డీఆర్‌డీవో సాయన్న, అధికారులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు సమ ప్రాధాన్యం



అక్బర్‌నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్‌: తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇస్తోందని స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రుద్రూర్‌ మండలం అక్బర్‌నగర్‌లో సోమవారం ఆయన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ.50లక్షలతో చేపట్టిన నక్కల వాగు బ్రిడ్జి, సీసీ రోడ్లు, పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. రూ.75లక్షలతో చేపట్టనున్న అభయాంజనేయ స్వామి ఆలయ పనులు, సీసీ రోడ్లు, మజీద్‌ ప్రహరీ, దర్గా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాక అక్బర్‌నగర్‌కు రూ.మూడు కోట్లు నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. దేవాలయాలు, ప్రార్థన మందిరాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. విఠలేశ్వర ఆలయానికి రూ.10లక్షలు, అభయాంజనేయ స్వామి ఆలయానికి అదనంగా రూ.10లక్షలు, దుర్గామాత గుడికి ఎండోమెంట్‌ ద్వారా రూ.25లక్షలు మంజూరైనట్లు చెప్పారు.

ప్రకృతి ఆశ్రమం అభివృద్ధికి రూ.75లక్షలు

అక్బర్‌నగర్‌లోని ప్రకృతి ఆశ్రమంలో తక్కువ ఖర్చుతో మంచి చికిత్స లభిస్తుందని స్పీకర్‌ పోచారం అన్నారు. ఆశ్రమంలో స్థానికులు వంద మంది ఉపాధి పొందుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆశ్రమ అభివృద్ధి పనులకు రూ.75లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ గంగమణిప్రసాద్‌, ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్‌, జెడ్పీటీసీ సరోజి గంగారాం, ఉప సర్పంచ్‌ రంజిత్‌, వైస్‌ ఎంపీపీ సాయిలు, తోట సగయ్య, పత్తి లక్ష్మణ్‌, సంజీవ్‌ పాల్గొన్నారు.

కంప్యూటర్‌ కోర్సులకు డిమాండ్‌



అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్‌ మానస

తెయూ(డిచ్‌పల్లి): కంప్యూటర్‌ కోర్సులు పూర్తి చేసి మంచి నైపుణ్యాలు పెంపొందించుకున్న విద్యార్థులకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్‌ ఉందని రిసోర్స్‌ పర్సన్స్‌ మానస, నిత్యలక్ష్మీ పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజినీరింగ్‌ విభాగం, హైదరాబాద్‌ ఎంవీఎస్‌ఆర్‌ ఇంజినీరింగ్‌ కాలేజీ ఆధ్వర్యంలో సోమవారం కాలేజీ సెమినార్‌ హాల్‌లో 'బిల్డింగ్‌ మెషీన్‌ లెర్నింగ్‌ వెబ్‌ అప్లికేషన్స్‌ త్రూ ఓపెన్‌ సోర్స్‌ కోడ్‌ ఫ్లాట్‌ఫామ్‌' అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా.. మెషీన్‌ లెర్నింగ్‌, ఉపయోగాలు, కంప్యూటర్‌ అప్లికేషన్స్‌, డాటా అక్విజిషన్‌, ప్రీ ప్రాసెసింగ్‌ తదితర అంశాలపై రిసోర్స్‌ పర్సన్‌ మానస అవగాహన కల్పించారు. పైథాన్‌ లాంగ్వేజ్‌, మెషీన్‌ లెర్నింగ్‌లో ప్యాకేజెస్‌ ను ఎలా వాడాలనే అంశాలపై నిత్యలక్ష్మీ వివరించారు. వర్క్‌షాప్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ ఆరతి, కన్వీనర్‌ నందిని, అధ్యాపకులు భ్రమరాంభిక, అతిఫ్‌, నీలిమ, ఆనంద్‌ పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్‌ రంగంలో ఉద్యోగాల కోసం 29న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్‌ ఒక ప్రకటనలో తెలిపారు. పీవీఆర్‌ వేణుమాల్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌, జీవన్‌రెడ్డి మాల్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సేల్స్‌ ఎగ్జిక్యూటివ్‌, టెక్నీషియన్స్‌, టీమ్‌ లీడర్లు నిజామాబాద్‌, ఆర్మూర్‌ ప్రాంతంలో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్‌, ఐటీఐ, ఎలక్ట్రికల్‌, హోటల్‌ మేనేజ్‌మెంట్‌ ఆపైన చదివిన అభ్యర్థులు అర్హులని, 28 ఏళ్ల లోపు ఉన్నవారు హాజరు కావాలని సూచించారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతి, యువకులు బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటోలు తీసుకొని నగరంలోని శివాజీనగర్‌ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 6305743423, 9581768413, 9959456793 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఎక్సైజ్‌ స్టేషన్‌లో వాహనాల వేలం..

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 29న వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్‌ నగర సీఐ మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల వేలం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల వారు పాటలో పాల్గొని వాహనాలను దక్కించుకోవాలన్నారు.

కిక్‌ బాక్సర్‌కు సన్మానం



నిజామాబాద్‌నాగారం:ఆల్‌ ఇండియా యూనివర్సిటీ కిక్‌ బాక్సింగ్‌ టోర్నమెంట్‌లో గిరిరాజ్‌ కాలేజీ బీఏ విద్యార్థి ఉమ రజతం పతకం సాధించింది. పతకం సాధించడంపై ఆమెను సోమవారం కళాశాల ప్రిన్సిపల్‌ రామ్మోహన్‌ రెడ్డి, పీడీ బాలమణి సన్మానించారు.

'దేశ రక్షణ కోసం ముందుకురావాలి'



సైనికుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

తాడ్వాయి: దేశ రక్షణ కోసం యువత ముందుకు రావాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిట్యాల గ్రామంలో సోమవారం దివంగత ఆర్మీ జవాన్‌ కంది సిద్దిరాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిద్దిరాములు దేశ రక్షణలో వీరమరణం పొందారన్నారు. ఆయన స్ఫూర్తితో యువత సైన్యంలో చేరాలని, ఇంటికో సైనికుడు తయారు కావాలని సూచించారు. సిద్దిరాములు తల్లి తన పింఛన్‌ డబ్బుల కొడుకు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. సిద్దిరాములు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ అన్యోన్య, సీఐ శ్రీనివాస్‌, ఎస్సై అంజనేయులు, భువనేశ్వర్‌, ఎంపీటీసీ రాజమణి, సిద్దిరాములు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడు



బాన్సువాడ: సమాజంలో కులమత భేదాలు లేకుండా మనుషులందరు ఒకటేనని 1200 ఏళ్ల కిత్రమే చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడని స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలోని ఒకటో వార్డులో వీరశైవలింగాయత్‌ కమ్యూనిటీ భవన నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజురు చేశానని, మరో రూ.25 లక్షలు మంజురు చేస్తాననన్నారు. బసవేశ్వర జయంతి అధికారికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్‌ అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో 200 ఎకరాల్లో అన్ని కులాలకు భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో బసవేశ్వర భవనం కోసం రూ.కోటి నిధులు కూడా మంజురు చేసిందని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. బ్రెస్ట్‌ ఫీడింగ్‌ ఫ్రెండ్లీ అక్రిడేషన్‌లో బాన్సువాడ మాత శిశు ఆస్పత్రికి దేశంలోనే అవార్డు రావడంతో హర్షనీయమన్నారు. డీసీసీబీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్‌, వీరశైవలింగాయత్‌ సంఘం జిల్లా అధ్యక్షుడు దిగంబర్‌, శంకర్‌పటేల్‌, విజయ్‌పటేల్‌, మారుతి పటేల్‌, మహాదేవి, శ్రీలత, గంట చంద్రశేఖర్‌, మల్లికార్జున్‌, వీరప్ప, రమేష్‌, సుభాష్‌, ఆంజనేయులు, అశోక్‌పటేల్‌, నాయకులు అంజిరెడ్డి ఉన్నారు.

నియామకం



కామారెడ్డి అర్బన్‌: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ కామారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శిగా వి భాస్కర్‌ను నియమిస్తు రాష్ట్ర డైరెక్టర్‌ ఎంఏ సలీం నియామక పత్రం అందజేశారు. సమాచార హక్కు చట్టం అమలు కోసం జిల్లా అంతటా పర్యటించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సలీం కోరారు. ఈ కార్యక్రమంలో స.హ చట్టం పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ప్రదీప్‌కుమార్‌, ఎస్‌.లింబయ్య, షబనా, చారి తదితరులు పాల్గొన్నారు.

నిఖత్‌ జరీన్‌కు బాజిరెడ్డి అభినందనలు



మోపాల్‌: ప్రపంచ మహిళల బాక్సింగ్‌ పోటీల్లో గోల్డ్‌ మెడల్‌ సాధించి సత్తా చాటిన నిఖత్‌ జరీన్‌కు టీఎస్‌ ఆర్టీసీ చైర్మన్‌, రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. నిజామాబాద్‌ బిడ్డ నిఖత్‌ సాధిస్తున్న వరుస విజయాలు యావత్‌ దేశానికి గర్వ కారణమని హర్షం వ్యక్తం చేశారు. నిజామాబాద్‌ కీర్తి ప్రతిష్టలు, రాష్ట్ర గౌరవాన్ని చిరస్థాయిలో నిలిచిపోయేలా తన ప్రతిభను కనబరుస్తున్న ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. నిఖత్‌ జరీన్‌కు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో మరింతగా విస్తరింపజేయాలని ఆకాంక్షించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



కౌన్సెలింగ్‌ ఇస్తున్న అధికారులు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలోని గాంధీనగర్‌లో మంగళవారం జరగనున్న బాల్య వివాహాన్ని అధికారులు సోమవారం అడ్డుకున్నారు. మంగళవారం వివాహం ఉండగా సమాచారం అందుకున్న ఐసీపీఎస్‌ అధికారి జాముర, ఐసీడీఎస్‌ ఏసీడీపీఓ జ్ఞానేశ్వరీ, సూపర్‌వైజర్‌ సరస్వతి, స్థానిక రెవెన్యూ, పోలీస్‌ అధికారులతో సోమవారం గాంధీనగర్‌కు చేరుకున్నారు. బాల్య వివాహ కార్యక్రమాలను అడ్డుకున్నారు. ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్‌ ఇచ్చారు. అనంతరం బాలికను కేజీబీవీకి తరలించారు.

క్రైం కార్నర్‌

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి



ప్రవీణ్‌(ఫైల్‌)

నాగిరెడ్డిపేట: మండలంలోని బొల్లారం ఊరచెరువులో చేపలవేటకు వెళ్లిన ఓ జాలరి ప్రమాదవశాత్తు నీటమునిగి మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన బెస్త ప్రవీణ్‌(25) గ్రామశివారులోని చెరువులో ఆదివారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల వేటకు వెళ్లిన ప్రవీణ్‌ తిరిగి ఇంటికి చేరకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు చెరువులో గాలించారు. అయినా అతని ఆచూకీ లభించకపోవడంతో సోమవారం ఎల్లారెడ్డి అగ్నిమాపక సిబ్బందితోపాటు నాగిరెడ్డిపేట పోలీసులు చెరువులో గాలించి ప్రవీణ్‌ మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రవీణ్‌ వల వేసేక్రమంలో ప్రమాదవశాత్తు తెప్పపై నుంచి నీటిలో పడిపోవడంతోపాటు కాళ్లకు, వల చుట్టుకోవడంతో మృతిచెందినట్లుగా గుర్తించారు. మృతుడి తల్లి బేస్త దేవవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..



నర్సింలు(ఫైల్‌)

మాచారెడ్డి: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని బండ రామేశ్వరపల్లిలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై సంతోష్‌ కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనికేషి నర్సింలు(45) పొలం వద్ద విద్యుత్‌ మోటార్‌కు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య



రాజమణి (ఫైల్‌)

నవీపేట: మండలంలోని రాంపూర్‌ గ్రామానికి చెందిన పుల్లూరి రాజమణి(38) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజారెడ్డి సోమవారం తెలిపారు. రాజమణికి మతిస్థిమితం లేకపోవడంతో భర్త విడాకులు ఇచ్చాడని పేర్కొన్నారు. తల్లిదండ్రుల దగ్గరే ఉంటున్న రాజమణి జీవితంపై విరక్తి చెంది సోమవారం ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. బాధితురాలిని 108లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. మృతురాలి సోదరుడు రాజశేఖర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని సారంగపూర్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఫయజుల్‌(20) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై జ్ఞానసింగ్‌ సోమవారం తెలిపారు. ఫయజుల్‌ సారంగాపూర్‌లోని సోఫా తయారీ సెంటర్‌లో మూడు నెలలుగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో బోల్తా : పలువురికి గాయాలు



పెద్దకొడప్‌గల్‌: మండలంలోని చిన్నతక్కడ్‌పల్లి చౌరస్తా సమీపంలో జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. చిన్నదేవాడ నుంచి చిన్నకొడప్‌గల్‌కి ఆటోలో పలువురు శుభకార్యానికి వెళ్తుండగా మార్గమధ్యలోని ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అదే దారిలో వెళ్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌సింధే కుమారుడు హరీశ్‌సింధే క్షతగాత్రులను పరామర్శించారు. గాయపడిన వారికి అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌ మద్యం మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. మద్యం తాగి ఆటో నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి నాలుగేళ్ల జైలు

ఖలీల్‌వాడి :బాలుడిపై హత్యాయత్నం చేసిన కుడుములు లడ్డు ఆలియాస్‌ సుంకరి రవికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్‌ అసిస్టెంట్‌ సెషన్స్‌ జడ్జి ఎస్‌ శ్రీకాంత్‌ బాబు సోమవారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పాలారం గ్రామానికి చెందిన శ్యామ్‌(13) తన చిన్నాన్న అయిన కుడుములు రాజు దగ్గరకు నందిపేట్‌ మండలం వన్నెల్‌(కె) గ్రామానికి వచ్చాడు. వారి బంధువైన కుడుములు లడ్డు అలియాస్‌ సుంకరి రవి మాక్లూర్‌ మండలం ధర్మోరాలో స్థిరపడ్డాడు. రవి వన్నెల్‌(కె) గ్రామానికి వచ్చి నిజామాబాద్‌లో సినిమా చూసివద్దామని చెప్పి 2016 జూన్‌ 2న శ్యామ్‌ను బైక్‌పై తీసుకెళ్లాడు. శ్యామ్‌ తండ్రి జీవరత్నంతో తనకు ఉన్న పాత కక్షను మనసులో పెట్టుకొని అతనిని చంపాలనుకున్నాడు. నందిపేట వైన్‌షాపులో కొనుగోలు చేసిన బీర్లు తాగి, బీరు సీసాను పగులగొట్టి శ్యామ్‌ను పొడిచి మృతి చెందాడని భావించి వెళ్లిపోయాడు. గాయపడిన బాలుడిని చూసిన గ్రామస్తులు నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిజామాబాద్‌ రూరల్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ కోర్టుకు సమర్పించిన అభియోగ పత్రం ఆధారంగా సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసిన కోర్టు ముద్దాయిపై హత్యాయత్నం కేసు రుజువైనట్లు నిర్ధారిస్తూ నాలుగేళ్ల కఠిన జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. పోలీసుల తరపున అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ లక్ష్మీనర్సయ్య వాదనలు వినిపించారు.

బావపై బావమరిది దాడి



గాయపడిన సంగయ్య

రామారెడ్డి: కుటుంబ కలహాల నేపథ్యంలో బావపై బావమరిది దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని రంగంపేట శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్సై రవీందర్‌రావు తెలిపిన వివరాలు.. కామారెడ్డి మండలం లింగాపూర్‌కు చెందిన మల్లుపేట సంగయ్యకు, ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన మానసతో వివాహం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో మానస తల్లిగారింటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో తన భార్యను కాపురానికి తీసుకెళ్లడానికి సంగయ్య తన పెద్దమ్మతో కలిసి ఉప్పల్‌వాయి వచ్చాడు. అక్కడ సంగయ్యకు అత్తమామలతో గొడవ జరిగింది. దీంతో వారి ఇద్దరిని సంగయ్య చితకబాదినట్లు గ్రామస్తులు తెలిపారు. దాడి అనంతరం సంగయ్య తన గ్రామానికి బయలు దేరగా రంగంపేట శివారు దగ్గర మానస సోదరుడు నరేష్‌ కట్టింగ్‌ ప్లేర్‌తో సంగయ్య తలపై దాడి చేశాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎవరు ఫిర్యాదు చేయలేదని ఏఎస్సై తెలిపారు.

ఇద్దరి బైండోవర్‌



నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని మహమ్మద్‌నగర్‌ గ్రామానికి చెందిన ఆకాష్‌, బూర్గుల్‌ గ్రామానికి చెందిన రాజశేఖర్‌ను సోమవారం తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై నాగగోని రాజు తెలిపారు. గతంలో వీరిపై పలు కేసులు ఉండటంతో ఇక మీదట గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, అల్లరు జరగకుండా ముందస్తుగా బైండోవర్‌ చేశామని ఎస్సై చెప్పారు.

సెల్‌ఫోన్ల చోరీ కేసులో నిందితుడి రిమాండ్‌

ఎల్లారెడ్డి: సెల్‌ ఫోన్లను చోరీ చేసిన నిందితుడిని పట్టుకుని రిమాండ్‌ చేసినట్లు ఎస్సై గణేష్‌ సోమవారం తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పాత నేరస్తుడు గుజ్జరి నాగరాజు పట్టణంలోని సలీం రైస్‌మిల్‌లో హమాలీలకు చెందిన మూడు సెల్‌ ఫోన్లను దొంగిలించినట్లు ఆయన తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి రిమాండ్‌ చేశామన్నారు.